



## రేపటి స్పందన కార్యక్రమం రద్దు

**పాడేరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):** ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఈ నెల 9న రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనాపరమైన కారణాలతోనే శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి శుక్రవారం అర్జీలను సమర్పించేందుకు ఐటీడీఏ కార్యాలయానికి రావద్దని కలెక్టర్ కోరారు.

# సీతాలు పండుగ లేకపాయె!

**ఏజెన్సీలో ఏటా కల్లాల్లో ధాన్యపు రాశుల వద్ద వేడుక**

**రెండు నెలల క్రితం మిచౌంగ్ తుఫాన్ వల్ల వరి పంటను కల్లాలకు చేర్చలేకపోయిన వైనం**

**ఈ ఏడాది పండుగ జరుపుకోలేకపోతున్నామని గిరి రైతుల ఆవేదన**

(పాడేరు-ఆంధ్రజ్యోతి)



సీతాలు పండుగ చేస్తున్న గిరిజన రైతులు (ఫైల్ ఫొటో)

**ఏజెన్సీలో పూర్వం నుంచి జరుపుకునే సీతాలు పండుగకు మిచౌంగ్ తుఫాన్ కారణంగా ఈ ఏడాది బ్రేక్ పడింది. కల్లాల్లో ధాన్యం రాశులుగా పోసి అట్టహాసంగా నిర్వహించే ఈ వేడుక ఈసారి దూరమైంది. రెండు నెలల క్రితం వచ్చిన మిచౌంగ్ తుఫాన్ వల్ల వరి పంటను కల్లాల్లోకి చేర్చే అవకాశం లేకపోవడంతో ఈ ఏడాది పండుగ జరుపుకోలేకపోతున్నామని గిరి రైతులు ఆవేదన చెందుతున్నారు.**

ఏజెన్సీలో వరి నూర్పులు చేపట్టే సందర్భంలోనే తమ కల్లాల్లో ధాన్యం రాశులుగా పోసి సీతాలు పండుగను నిర్వహించడం ఆనవాయితీ. అయితే గతేడాది వరి కోతలు, నూర్పులు చేపట్టే సమయంలోనే మిచౌంగ్ తుఫాన్ తీవ్ర ప్రభావం చూపడం వల్ల ఏజెన్సీలోని గిరిజన రైతులు సీతాలు పండుగను చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి వరి కోతలు ముగిసి, నూర్పులు సైతం ఆఖరు దశకు వచ్చే సమయంలో గిరిజన రైతులు సీతాలు పండుగను ఉత్సాహంగా నిర్వహించుకుంటారు. అయితే తుఫాన్ ప్రభావం వల్ల ఎక్కడికక్కడ వరి పంటలను కాపాడుకునే పనిలో పడడంతో పాటు పంటను రక్షించుకుని ఇళ్లకు చేర్చుకోవడంతో కల్లాల్లోకి చేర్చే అవకాశం లేకపోయింది.

### సీతాలు పండుగలో ఏం చేస్తారంటే?

గిరిజనులు తమ పొలంలో పండిన వరిని కల్లాల్లోనే నూర్పుతారు. నూర్పులు పూర్తయిన సందర్భంగా కొంత ధాన్యాన్ని దంచి బియ్యం సిద్ధం చేస్తారు. కుటుంబం, తమకు సన్నిహితులైన వారిని కల్లానికి ఆహ్వానిస్తారు. ఈ క్రమంలో ధాన్యపు రాశులను కుప్పగా పోసి వాటిని ముగ్గులు, పూలతో అలంకరిస్తారు. తమ ఇష్టదైవాన్ని స్మరించుకుని కోడిని కోసి, కొత్త బియ్యంతో అన్నం వండి అక్కడికి వచ్చిన వారందరికీ భోజనాలు పెడతారు. ఇలా చేయడం వల్ల తమ పొలంలో ఇంత పంట పండిందనే విషయం పల్లెలో జనానికి తెలియడంతో పాటు సీతాలు పండుగ చేయడం వల్ల రానున్న రోజుల్లో ఈ ధాన్యపు రాశులు రెట్టింపు అవుతాయని గిరిజనుల నమ్మకం. తమ పంట దిగుబడి విషయంలో దాపరికం లేకుండా ఉండాలనే ఆలోచనతోనే పూర్వీకులు సీతాలు పేరిట ఈ తంతును అలవాటు చేశారని కొందరు గిరిజనులు చెబుతున్నారు. సీతాలు పండుగ సందర్భంగా గిరిజన పల్లెల్లో ఎవరికి ఎంత మొత్తంలో పంట పండిందనే విషయం అందరికీ తెలియడం వల్ల పంట బాగా పండని వారికి ఇతరులు సహాయం చేసేందుకు అవకాశం ఉంటుందని మరికొంత మంది గిరిజనులు అంటున్నారు. అటువంటి ప్రాధాన్యం వున్న సీతాలు పండుగను ఈ దఫా జరుపుకొనే అవకాశం లేకపోయిందని పలువురు గిరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఉమ్మడి జిల్లాలో 329 ఉపాధ్యాయ ఖాళీలు

**విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి విశాఖ జిల్లాలో 329 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్టు ప్రభుత్వం తేల్చింది. ఇందులో సెకండరీగ్రేడ్ 101, స్కూలు అసిస్టెంట్ 133, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులు 95 ఉన్నాయి. ఈ మేరకు బుధవారం పాఠశాల విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లాల వారీగా ఖాళీల వివరాలు వెల్లడించారు. అయితే మేనేజ్‌మెంట్‌ల వారీగా ఖాళీలు, స్కూలు అసిస్టెంట్ పోస్టుల్లో సబ్జెక్టుల వారీగా వివరాలు ఇంకా ప్రకటించలేదు. ఈనెల 12వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలు కానున్నందున ఆ రోజు సబ్జెక్టు వారీగా ఖాళీలు వెల్లడిస్తారని విద్యా శాఖ వర్గాలు తెలిపాయి.

# సుజల స్రవంతిపైనా అబద్ధాలు

**పనులు పురోగతిలో ఉన్నాయంటూ మంత్రి ప్రకటన**

**ప్రాజెక్టుకు ఐదేళ్లలో పైసా విదల్చని వైసీపీ ప్రభుత్వం**

**కనీసం భూ సేకరణకు కూడా నిధులు విడుదల చేయని వైనం**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):** 'ఉత్తరాంధ్ర సుజల స్రవంతి' ప్రాజెక్టుపై అసెంబ్లీ సాక్షిగా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అబద్ధం ఆడేశారు. ప్రాజెక్టు పనులు పురోగతిలో ఉన్నాయని మంత్రి ప్రకటించడం ప్రజలను మోసపుచ్చడమేననే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఐదేళ్లలో సుజల స్రవంతి ప్రాజెక్టుకు పైసా విదల్చలేదు. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రూ.6.5 కోట్లు కూడా ఇంతవరకూ చెల్లించలేదు. కనీసం ప్రధాన కాలువ నిర్మాణానికి అవసరమైన భూమిని అప్పగించాలని కాంట్రాక్టర్ కోరినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు. భూసేకరణకు అనకాపల్లిలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటుచేశారు. కాలువల నిర్మాణం నిమిత్తం అనకాపల్లి జిల్లాలో 6,435 ఎకరాల సేకరించాల్సి ఉండగా... 1,157 ఎకరాలకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీచేశారు. అయితే ఆ భూమికి సంబంధించి అవార్డు ... మిగతా 8వ పేజీలో

# కరెంటు కష్టాలు ఇంకెన్నాళ్లు?

**కలగానే మిగిలిన చింతపల్లికి ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ ఏర్పాటు**

**వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రతిపాదనలను పక్కన పెట్టేసిన వైనం**

**కొరుప్రోలు, బలిఘట్టం విద్యుత్‌లైన్‌లో సాంకేతిక సమస్య తలెత్తితే అంధకారమే**

**చింతపల్లి, జీకే వీధి మండలాల ప్రజలకు తప్పని అవస్థలు**



చింతపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్



బలిఘట్టం నుంచి చింతపల్లికి విద్యుత్ సరఫరా చేసే లైన్

**చింతపల్లి, ఫిబ్రవరి 7:** చింతపల్లి సబ్ డివిజన్‌కి పాడేరు నుంచి ప్రత్యామ్నాయ 33 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా దీనిని ప్రతిపాదనలకే పరిమితం చేసింది. దీంతో సాంకేతిక సమస్య తలెత్తితే చింతపల్లి, జీకే వీధి మండలాల గిరిజన గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయి.

చింతపల్లి, జీకేవీధి మండలాల్లోని సుమారు 525 గిరిజన గ్రామాలకు బలిఘట్టం 132/33 కేవీ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతున్నది. బలిఘట్టం 132/33 కేవీ సబ్ స్టేషన్‌కి కొరుప్రోలు 132/33కేవీ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతున్నది. కొరుప్రోలు నుంచి చింతపల్లి వరకు ఎక్కడ సాంకేతిక సమస్య తలెత్తిన ఈ రెండు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. సాంకేతిక సమస్య పరిష్కరించే వరకు చింతపల్లి, జీకేవీధి మండలాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గం లేదు. సాంకేతిక సమస్య పరిష్కరించే వరకు చింతపల్లి, జీకేవీధి మండలాల ప్రజలు చీకట్లో ఉండాల్సిందే. ఈ సమస్యను అధిగమించేందుకు పాడేరు నుంచి అదనపు 33 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని గత టీడీపీ ప్రభుత్వం 2019 జనవరిలో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే ఆ తరువాత ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడం లేదు.

### స్పందించని వైసీపీ ప్రభుత్వం

పాడేరు 132/33 కేవీ సబ్ స్టేషన్ నుంచి చింతపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్‌కి విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉంది. పాడేరు 132/33 కేవీ సబ్ స్టేషన్ నుంచి జి.మాడుగుల వరకు 33 కేవీ విద్యుత్ సరఫరా జరుగుతున్నది. జి.మాడుగుల నుంచి చింతపల్లికి 39 కిలోమీటర్లు అదనపు విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేయాల్సి వుంటుంది. ఈ అదనపు విద్యుత్ లైన్ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్వే నిర్వహించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అదనపు విద్యుత్ లైన్ ఏర్పాటుకు ఈపీడీసీఎల్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించారు. అయితే ఐదేళ్లు గడిచినా ఆ ప్రతిపాదనలపై వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. దీంతో చింతపల్లి, జీకేవీధి మండలాల ప్రజలకు మోక్షం కలగలేదు.

### పాడేరు నుంచి విద్యుత్‌లైన్ వేస్తే..

పాడేరు నుంచి చింతపల్లికి ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తే చింతపల్లి, జీకేవీధి మండలాల గిరిజన గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతుంది. కొరుప్రోలు, నర్సీపట్నం విద్యుత్ లైన్‌లో సాంకేతిక సమస్య తలెత్తినా గంటల తరబడి విద్యుత్ కోసం ఈ ప్రాంత ప్రజలు నిరీక్షించే పరిస్థితి ఉండదు. బలిఘట్టం 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి చింతపల్లికి విద్యుత్ సరఫరా నిలిచిపోతే ప్రత్యామ్నాయంగా వెంటనే పాడేరు 132/33కేవీ సబ్ స్టేషన్ ద్వారా రెండు మండలాల ప్రజలకు విద్యుత్‌ను సరఫరా చేసే అవకాశముంటుంది.

## కొనసాగుతున్న చలి తీవ్రత

**జి.మాడుగులలో 11.4 డిగ్రీలు**

**పాడేరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):** ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నప్పటికీ చలి ప్రభావం తగ్గడం లేదు. జి.మాడుగులలో 11.4, పాడేరులో 11.8, జీకేవీధిలో 12.3, అరకులోయలో 12.7, హుకుంపేటలో 12.9, చింతపల్లిలో 14 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి. అయితే తాజా వాతావరణంలో చలి ప్రభావం ఉన్నప్పటికీ పొగమంచు అంతగా లేదు. అలాగే ఎండ ప్రభావం సైతం క్రమంగా పెరుగుతున్నది.

# పోలింగ్ కేంద్రాల సందర్శన తప్పనిసరి

**11 మండలాల తహసీల్దార్లకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం**

**పాడేరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):** తహసీల్దార్లు విధిగా పోలింగ్ కేంద్రాలను సందర్శించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బదిలీపై వచ్చిన పాడేరు డివిజన్‌లోని పదకొండు మండలాలకు చెందిన తహసీల్దార్లతో బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించి, అక్కడి పరిస్థితులపై అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. అలాగే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చులను పక్కాగా నమోదు చేయాలన్నారు. అభ్యర్థులకు సంబంధించి మీడియాలో ప్రచురిస్తున్న ప్రకటనలు, కరపత్రాలు, గోడ పత్రికలు, ప్రసార మాధ్యమాల్లోని ప్రకటనలను తప్పనిసరిగా పరిశీలించి, ఆయా ఖర్చులను గుర్తించి పక్కాగా నమోదు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్లు స్వయంగా పరిశీలించి స్థితిగతులపై తనకు నివేదించాలని ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, సజావుగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పక్కాగా అమలు చేయాలన్నారు. తమ పరిధిలోని జోనల్, బూత్ స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావన, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పి.అంబేడ్కర్, వీవీఎస్ శర్మ, పాడేరు డివిజన్‌లోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.





సమావేశానికి హాజరైన తహసీల్దార్లు, డీటీలను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్. చిత్రంలో జేసీ భావన, పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఉన్నారు

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ డ్రైవ్ రేపు

**పాడేరురూరల్, ఫిబ్రవరి 7:** ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 9వ తేదీన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఇండస్ట్రీ కస్టమైజ్డ్ ట్రైనింగ్ జాబ్ డ్రైవ్‌ను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. జాబ్ డ్రైవ్‌లో డెక్కన్ ఫైన్ కెమికల్స్ పాల్గొంటుందన్నారు. ఈ జాబ్ డ్రైవ్‌ను బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ పూర్తి చేసిన 27 ఏళ్లలోపు నిరుద్యోగ యువకులు అర్హులన్నారు. జాబ్ డ్రైవ్‌కు హాజరయ్యే యువకులు ముందుగా స్కిల్ యూనివర్సీ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని రావాలన్నారు. పూర్తి వివరాలకు 9398338105 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.



**మల్లు దొర వారసుడికి మెరుగైన వైద్య సేవలు**

ఐటీడీఏ పీవో చొరవతో రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో బోడి దొరకు చికిత్స 8



# పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు కోసం అటవీ భూములు పరిశీలన

**9న కేంద్ర పర్యావరణ శాఖ అధికారులతో భేటీ**

**ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి**

**సీలేరు, ఫిబ్రవరి 7:** జీకేవీధి మండలం సీలేరులో ఏపీ జెన్‌కో ప్రతిపాదిత 1350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమని డీపీఆర్‌లో జెన్‌కో పేర్కొన్న అటవీ భూములను అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ (సీసీఎఫ్) శ్రీకంఠనాథరెడ్డి బుధవారం పరిశీలించారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాల నేపథ్యంలో సీలేరులో 1350 మెగావాట్ల సామర్థ్యం గల పంప్డ్ స్టోరేజీ(ఎత్తిపోతల ప్రాజెక్టు)కు అనుకూలమని నిపుణుల సూచనలతో ఏపీ జెన్‌కో సర్వే నిర్వహించి డీపీఆర్‌ను తయారు చేయించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 215.14 హెక్టార్ల భూమి అవసరముందని వ్యాప్‌కోస్ సంస్థ సమగ్ర నివేదికలో పేర్కొంది. అయితే ఈ ప్రాజెక్టు నిర్మించే ప్రదేశం రిజర్వు ఫారెస్టులో ఉండడంతో ఏపీ జెన్‌కో పంప్డ్ స్టోరేజీ నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించాలని రాష్ట్ర అటవీ, రెవెన్యూ శాఖలకు దరఖాస్తులు చేశారు. ఈ మేరకు గతంలో డీఎఫ్ స్థాయి అధికారులు జెన్‌కో డీపీఆర్‌లో పేర్కొన్న భూములను సర్వే చేసి నివేదికను అటవీశాఖకు అందజేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అటవీ అనుమతులు కేంద్రప్రభుత్వం నుంచి రావలసి ఉంది. ప్రాజెక్టుకు సంబంధించిన తుది నివేదికను సీసీఎఫ్ ఇవ్వాల్సి ఉన్నందున పంపింగ్ ప్రాజెక్టుకు అవసరమైన 215 హెక్టార్లలో నాలుగు భాగాల్లో జెన్‌కో అధికారులు మార్కింగ్ చేసిన ప్రదేశాలను జీపీఆర్ఎస్‌తో పరిశీలించి, మ్యాపింగ్‌లో ఉన్న విధంగా ఉన్నాయా?, లేదా అని పరిశీలించారు. డంపింగ్‌యార్డు, విద్యుత్ కేంద్రం నిర్మించే ప్రదేశం, భూగర్భంలో టన్నెల్ ఏ విధంగా వస్తోందో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జెన్‌కో ప్రతిపాదించిన పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు 215 హెక్టార్ల అటవీ భూమి అవసరమున్నందున వాటిని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు సీఈ బి.శ్రీధర్, పంప్డ్ స్టోరేజీ ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ రత్నాకర్, ఎస్ఈ కేకేవీ ప్రశాంత్‌కుమార్, ఈఈ ప్రభాకరరావు, ఏడీఈలు అప్పలనాయుడు, వెంకట మధు, డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్, సబ్ డీఎఫ్‌వో బెర్నాడ రాజు, రేంజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జెన్‌కో అధికారులతో కలిసి అటవీ భూములను పరిశీలిస్తున్న సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి



విలేకరుల మాట్లాడుతున్న ఏపీ జెన్‌కో పంప్డ్ స్టోరేజీ ఎస్ఈ చంద్రశేఖర్

### పర్యావరణ, అటవీ అనుమతులు రావాలి

సీలేరులో రూ.10 వేల కోట్లతో ప్రతిపాదించిన 1350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు పర్యావరణ, అటవీ అనుమతులు మాత్రమే రావాల్సి ఉందని ఏపీ జెన్‌కో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఎస్ఈ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం సీలేరు వచ్చిన ఆయన స్థానిక జెన్‌కో అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 9న పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల కోసం కేంద్ర పర్యావరణశాఖ అధికారులతో సమావేశం ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని చెప్పారు. అటవీ అనుమతులు, పర్యావరణ అనుమతులు వచ్చేలోగా పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఇంజనీరింగ్ పనులను చేపడతామని, దీనికి ఆరు నెలల సమయం పడుతుందన్నారు. ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో మొట్టమొదటిగా నిర్మిస్తున్న పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు వల్ల ఉన్న నీటిని నిల్వ చేసి మళ్లీ విద్యుత్ ఉత్పత్తిని చేసుకోవడానికి దోహదపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల సోలార్ ఎనర్జీ సామర్థ్యం ఉందన్నారు. దీన్ని ప్రస్తుతం 10 వేల మెగావాట్లకు పెంచనున్నామని, ఇంత కెపాసిటీ గల ఎనర్జీని స్టోరేజీ చేయడానికి అవకాశాలు లేకపోవడంతో దీన్ని ఉపయోగించుకుని సోలార్ ఎనర్జీ వచ్చే సమయంలో వాటర్‌ను స్టోరేజీకి ఉపయోగించుకుని, సాయంత్రం పీక్‌లోడ్ సమయంలో దాన్ని జనరేషన్ మోడ్‌లో పెట్టి విద్యుత్ ఉత్పత్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు సీఈ బి.శ్రీధర్, ఎస్ఈ కేకేవీ ప్రశాంత్‌కుమార్ ఈఈలు రత్నాకర్, వరప్రసాద్, ప్రభాకరరావు, ఏడీఈలు అప్పలనాయుడు, వెంకట మధు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌వీనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిజనులు

## మూలగరువులో కలకలం

**చనిపోయిన మేక మాంసం తిని పలువురికి అస్వస్థత**

**సకాలంలో స్పందించిన వైద్య సిబ్బంది**

**ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స**

**11 మందిని ఆర్‌వీనగర్ పీహెచ్‌సీకి తరలింపు**

**గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 7:** మండలంలోని జీకేవీధి పంచాయతీ మూలగరువు గ్రామంలో చనిపోయిన మేక మాంసం తిని పలువురు ఆదివాసీలు అస్వస్థతకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న ఆర్‌వీ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె. సౌమ్య, వైద్యసిబ్బంగి గ్రామానికి వెళ్లి ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. తీవ్ర అస్వస్థతకు గురైన 11 మందిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మూలగరువు గ్రామంలో మంగళవారం ఉదయం ఓ గిరిజనుడికి చెందిన మేక చనిపోయింది. దీంతో ... మిగతా 8వ పేజీలో



బాధితులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

## క్రైం... crime news

### అతిగా మద్యం తాగి యువకుడి మృతి

**కశింకోట, ఫిబ్రవరి 7 :** కశింకోటకు చెందిన ఓ వ్యక్తి అతిగా మద్యం తాగి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాలివి. కశింకోట పూసర్ల వీధికి చెందిన ధర్మిశెట్టి మోహన్(30) గత మూడు రోజులుగా తన స్నేహితుడైన శ్రీనివాసరావుతో కలిసి మద్యం తాగుతున్నాడు. సోమవారం ఉదయం 7 గంటలకు కశింకోట నుంచి యానాం వెళ్లి అప్పటి నుంచి మద్యం తాగుతూ సొంత గ్రామమైన కశింకోటకు బుధవారం చేరుకున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మద్యం తాగి కశింకోట వద్ద ఉన్న రైల్వే ట్రాక్‌కు కొద్దిపాటి దూరంలో సేద తీరారు. సాయంత్రం 5గంటల ప్రాంతంలో మోహన్‌ను స్నేహితుడైన శ్రీనివాసరావు ఎంత లేపినప్పటికీ మేల్కోకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

### అనుమానాస్పదంగా లారీ డ్రైవర్ మృతి


రవికుమార్ మృతదేహం

**లంకెలపాలెం, ఫిబ్రవరి 7:** అనుమానాస్పదంగా ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. జీవీఎంసీ 85వ వార్డు పరిధి మంత్రిపాలెం సమీపంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకొంది. దీనికి సంబంధించి పరవాడ ఎస్‌ఐ సురేశ్ తెలిపిన వివరాలిలా వున్నాయి. కాకినాడ ప్రాంతానికి చెందిన తుమ్మల రవికుమార్(48) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్థానికంగా గల యార్డులో లారీని నిలిపివేశాడు. అక్కడికి సమీపంలో ప్రధాన రహదారి పక్కనే తలకు బలమైన గాయంతో మృతి చెంది ఉన్నాడు. స్థానికులు గుర్తించి పరవాడ పోలీసులు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనాస్థలిని పరిశీలించారు. అతని తల, శరీరంపై గాయాలున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడం వల్లే తలకు బలమైన గాయం తగిలి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ఎలమంచిలి, ఫిబ్రవరి 7:** రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మునిసిపాలిటీ ఏఎస్ఆర్ కాలనీకి చెందిన కోట్ని సత్తిబాబు(44) గత నెల 24వ తేదీన ఏఎస్ఆర్ కాలనీలోని యానాద్రమ్మ ఆలయం వద్ద ప్రమాదానికి గురయ్యాడు. అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

### అప్పులతో కౌలు రైతు ఆత్మహత్య


అప్పలరాజు (ఫైల్ ఫోటో)

**పద్మనాభం, ఫిబ్రవరి 7:** విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో అప్పులు తీర్చలేక కౌలు రైతు ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఏఎస్‌ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం...గ్రామానికి చెందిన పి.అప్పలరాజు (41) స్థానికంగా రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని బొప్పాయి తోట వేసి, లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టారు. పంట దెబ్బతినడంతో అనుకున్న దిగుబడి లేక నష్టాలు వచ్చాయి. దీంతో చేసిన అప్పులు తీర్చలేక దిగులుతో ఈనెల ఐదో తేదీన పొలంలోనే పురుగుల మందు తాగారు. ఈ విషయాన్ని గమనించిన సమీపంలోని రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు విజయనగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం అప్పలరాజు మృతిచెందారు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ సీహెచ్ శ్రీధర్ కేసు నమోదు చేశారు.

### 115 మద్యం బాటిళ్లు స్వాధీనం

- ప్రభుత్వ మద్యం దుకాణం సూపర్‌వైజర్ అరెస్టు


పట్టుబడిన మద్యం బాటిళ్లతో అధికారులు

**అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 7:** మద్యం బాటిళ్లను రవాణా చేస్తూ మద్యం దుకాణం సూపర్‌వైజర్ మంగళవారం రాత్రి పోలీసులకు పట్టుబడ్డాడు. అతని నుంచి పోలీసులు 115 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్ఈబీ సీఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. స్థానిక స్టేషన్‌రోడ్డులోని వెంకటేశ్వర థియేటర్ సమీపాన ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో కె.గణేశ్ సత్యకీర్తి సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ, సెబ్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ ఆదేశాల మేరకు దాడులు చేయగా, వేరొక మద్యం దుకాణంలో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్న జశ్వంత్‌కు మద్యం అమ్మే క్రమంలో గణేశ్ సత్యకీర్తిని పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటనలో జశ్వంత్ పరారీలో ఉన్నాడు. గణేశ్ సత్యకీర్తిని తమ సిబ్బందితో అదుపులోకి తీసుకుని 115 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. దీని విలువ సుమారు రూ.17,500లు ఉంటుందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

### ఆరు మద్యం సీసాలు స్వాధీనం

**ఎలమంచిలి, ఫిబ్రవరి 7:** ఎలమంచిలి బస్టాండ్ జంక్షన్ వద్ద ఆరు మద్యం సీసాలతో ఓ వ్యక్తి పట్టుబడినట్టు పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు. మునగపాక మండలం రామగిరికి చెందిన చిలుకు మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

### 40 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

**రావికమతం, ఫిబ్రవరి 7:** నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. మండలంలోని మరుపాక శివారులో నాటుసారా తయారు చేస్తున్నట్టు అందిన సమాచారంతో బుధవారం సిబ్బందితో కలసి దాడులు నిర్వహించామన్నారు. 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, సారా తయారీకి సిద్ధం చేసిన మూడు వేల లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశామన్నారు. .

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి కేసులో నిందితుడి అరెస్టు


వాసిరెడ్డి శేఖర్

**నర్సీపట్నం, ఫిబ్రవరి 7:** సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రుత్తల రత్నమాధురి మృతి కేసులో నిందితుడు నాతవరం మండలం వెన్నలపాలెం గ్రామానికి చెందిన వాసిరెడ్డి శేఖర్‌ను అరెస్టు చేసినట్టు సీఐ కాంతికుమార్ బుధవారం తెలిపారు. రత్నమాధురిని ప్రేమించి శారీరంగా కలిసి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని, విష ప్రయోగం చేసి ఆమె చావుకు కారణమయ్యాడని మృతిరాలి తల్లి, సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాసిరెడ్డి శేఖర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని, అనంతరం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | రూ.లలో |
| రైతు ధర | 108.00 |
| లైవ్ ధర | 128.00 |
| విత్ స్కిన్ | 216.00 |
| స్కిన్ లెస్ | 236.00 |

| కోడి గుడ్లు (నెక్) | |
|---|---|
| వంద గుడ్లు | రూ.లలో |
| విశాఖపట్నం | 555 |
| విజయనగరం | 559 |
| శ్రీకాకుళం | 559 |

# జంబల్లోవ తోటల్లో పేకాట డెన్!

- రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు జూదం
- చుట్టుపక్కల మండలాల నుంచి రాక
- నిత్యం రూ.15-20 లక్షల మేర చేతులు మారుతున్న నగదు
- పోలీసులు వస్తుంటే సమాచారం ఇవ్వడానికి యువకులతో పహారా
- సులువుగా తప్పించుకునేలా ఏర్పాట్లు


రోడ్డుకు ఎడమ వైపు వున్న ఈ కాలిబాటే పేకాట స్థావరానికి దారి!

**కోటవురట్ల, ఫిబ్రవరి 7:** కోటవురట్ల మండలం రామచంద్రపురం శివారు అల్లుమియాపాలెం సమీపంలోని జంబల్లోవ తోటల్లో పేకాట స్థావరాన్ని నిర్వహిస్తున్నారు. కోటవురట్లతోపాటు చుట్టుపక్కల మండలాల నుంచి రోజూ పలువురు జూదరులు ఇక్కడి వస్తున్నారు. పోలీసులు దాడులు చేస్తే.. పట్టుబడకుండా సురక్షితంగా పారిపోయేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇక్కడ పేకాట నిర్వహిస్తున్న వారికి వైసీపీ నేతల అండదండలు వుండడంతో పోలీసులు చూసీచూడనట్టుగా వుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కోటవురట్ల మండలం రామచంద్రపురం శివారు అల్లుమియాపాలెం అటవీ ప్రాంతంలో సంక్రాంతి పండుగకు వారం రోజుల ముందు పేకాట డెన్ ప్రారంభించారు. జూదం ఆడే ప్రాంతానికి రెండు మార్గాల ద్వారా వెళ్లవచ్చు. ఒకవైపు ఆర్అండ్‌బీ రోడ్డునుంచి అల్లుమియాపాలెం గిరిజన గ్రామానికి వెళ్లే రహదారికి కుడివైపు ఒక ప్రైవేటు గెస్ట్‌హౌస్ పక్క నుంచి కాలి బాట వుంది. ఈ మార్గంలో నుంచి ద్విచక్ర వాహనాలపై జంబల్లోవ తోటల్లోని పేకాట స్థావరానికి చేరుకుంటుంటారు. మరొక దారి నూకాలతల్లి గుడి దాటిన తరువాత మామిడితోట పక్క నుంచి వుంది. ఇక్కడ పేకాట ఆడటానికి కోటవురట్లతోపాటు ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట, తుని మండలాల నుంచి రోజూ 40 నుంచి 50 మంది వరకు జూదరులు వస్తుంటారు. పేకాట డెన్ నిర్వహిస్తున్న వ్యక్తి, అందరి వద్ద నుంచి సెల్‌ఫోన్లు తీసుకుని తన వద్ద ఉంచుకుంటాడు. ఒకవేళ పోలీసులు దాడులకు వస్తుంటే.. ముందుగానే సమాచారం అందేలా రెండు మార్గాల వద్ద ఇద్దరు యువకులు పహారా కాస్తుంటారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పేకాట ఆడుతున్నారు. నిత్యం రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు చేతులు మారుతున్నట్టు తెలిసింది. పోలీసులు వస్తుంటే.. పహారా వున్న వ్యక్తులు వెంటనే డెన్ నిర్వాహకుడికి ఫోన్ చేసి సమాచారం అందిస్తారు. దీంతో ఇతను జూదరులను అప్రమత్తం చేసి పోలీసులకు దొరక్కుండా పారిపోయేలా సహకరిస్తుంటాడు. పహారా కాసే యువకులకు ఒక్కొక్కరికి రోజుకు రూ.2 వేల చొప్పున కూలి రూపంలో చెల్లిస్తున్నట్టు తెలిసింది. కాగా అల్లుమియాపాలెం సమీపంలోని జంబల్లోవ తోటల్లో పేకాట డెన్ నిర్వహిస్తున్న విషయాన్ని ఎస్‌ఐ రమణయ్య 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. ఆ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో పలుమార్లు దాడులు చేశామని, కానీ జూదరులకు ముందుగానే సమాచారం రావడంతో పారిపోతున్నారని చెప్పారు.


పేకాట డెన్ వద్దకు వెళ్లడానికి మరో కాలిబాట

## పార్టీ ఏ బాధ్యతలు అప్పగించినా చేపట్టేందుకు సిద్ధం

- జనసేన నేత కొణతాల రామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

**అనకాపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):** జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించేందుకు సిద్ధమేనని మాజీ మంత్రి, జనసేన నేత కొణతాల రామకృష్ణ తెలిపారు. అనకాపల్లి గౌరీ గ్రంథాలయంలో మీడియా మిత్రుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ప్రధానంగా ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు సమస్యలపై పోరాడే పటిమ ఉందని, ఈ కారణంతోనే ఆయనతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నానన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని దత్తత తీసుకుని ఈ ప్రాంత సమస్యలపై పోరాడాలని పవన్‌ను కోరినట్టు చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏళ్ల తరబడి అనేక సమస్యలు పేరుకుపోయాయని, వాటిపై గతంలో ఉత్తరాంధ్ర చర్చా వేదిక పేరుతో పోరాటాలు సాగించామని, జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఇక ముందు ఉత్తరాంధ్ర వెనుకబాటు, సాగునీటి జల వనరులపై ప్రభుత్వ నిర్లక్ష్యం వంటి సమస్యలపై పోరాటాలు సాగించనున్నట్టు చెప్పారు. త్వరలో అనకాపల్లిలో పవన్ కల్యాణ్‌తో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ ఆదేశిస్తే ఎంపీ, లేదా ఎమ్మెల్యే స్థానం నుంచి పోటీ చేసేందుకు సిద్ధమేనని, ఒక వేళ పార్టీ కోసం పని చేయాలని బాధ్యతలు అప్పగించినా దానికి సిద్ధంగా ఉన్నానన్నారు. విశాఖ రైల్వే జోన్‌కు స్థలం కేటాయించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటన్నారు. రైల్వే జోన్ ఏర్పాటుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే జోన్ ప్రకటించిన తరువాత అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమకూర్చుకోవచ్చని, జోన్ కార్యాలయాన్ని డీఆర్ఎం కార్యాలయంలో నడపవచ్చని సూచించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం ఉందన్నారు. సమావేశంలో కొణతాల పెదబాబు, బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఆ వాల్‌పోస్టర్లు పోలీసుల సృష్టే!

- అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నాం
- ఏవోబీ ఎస్‌జడ్‌సీ కార్యదర్శి గణేశ్ పేరిట మీడియాకు లేఖ విడుదల

**ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 7:** తన పేరిట వాట్సాప్ గ్రూపుల్లో, ఏవోబీలోని పలు ప్రాంతాల్లో ప్రత్యక్షమైన వాల్‌పోస్టర్లతో మావోయిస్టు పార్టీకి ఎటువంటి సంబంధం లేదని, అంతా పోలీసుల సృష్టేనంటూ మావోయిస్టు పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ (ఎస్‌జడ్‌సీ) కార్యదర్శి గణేశ్ పేరిట బుధవారం మీడియాకు ఒక ప్రకటన విడుదలైంది. ఇటీవల దుడుమ, ఒనకడిల్లీ తదితర ప్రాంతాల్లో మావోయిస్టు నేత గణేశ్ పేరిట వాల్‌పోస్టర్లు ప్రత్యక్షమైన విషయం తెలిసిందే. దీంతో గణేశ్ పేరిట బుధవారం మీడియాకు లేఖ విడుదల అయ్యింది. "మా పార్టీ సభ్యులపై వాట్సాప్ గ్రూపుల్లో పోలీసులు ప్రచారం చేస్తున్న ఫేక్ న్యూస్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం. పార్టీ సభ్యులైన రమేశ్, రాజేశ్, స్వప్న, సంతు, తులసీలను మేము పార్టీ నుంచి బయటకు పంపించేశామని, ఏవోబీలోని రంగబయలు ప్రాంతంలో సంచరిస్తూ వారు కాంట్రాక్టర్ల నుంచి, ప్రజల నుంచి డబ్బులు, నిత్యావసర వస్తువులు సేకరిస్తున్నారని, వీరు గ్రామాలకు వస్తే ప్రజలు బంధించి మాకు అప్పజెప్పాలి" అని గణేశ్ పేరుతో ఒక ప్రకటన వాట్సాప్ గ్రూప్‌లలో ప్రచారం అవుతున్నది. అంతేకాకుండా వివిధ ప్రాంతాల్లో వాల్‌పోస్టర్లు కూడా వెలిశాయి. ఇది పూర్తిగా పోలీసులు సృష్టించినదేనని, ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదని, తన సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ప్రకటన ఇచ్చారని గణేశ్ పేర్కొన్నారు. పైన తెలియజేసిన సభ్యులను పార్టీ నుంచి తొలగించలేదని, తమ తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఏవోబీలో మావోయిస్టుల సమాచారం కోసం పోలీసులు ఇటువంటి నీచమైన ఎత్తుగడలకు పాల్పడి, ప్రజల్లో గందరగోళం సృష్టించి దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఈ దుష్ప్రచారాన్ని నమ్మరని, వాస్తవాలను నిర్ధారించుకోకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దని, వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయవద్దని గణేశ్ విజ్ఞప్తి చేశారు.


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
ఆంధ్ర–ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ
మా పార్టీ సభ్యులపై వాట్సప్ గ్రూప్‌లో పోలీసులు ప్రచారం చేస్తున్న ఫేక్ న్యూస్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం!

మావోయిస్టు నేత గణేశ్ పేరిట విడుదల చేసిన లేఖ

## ఆశ కార్యకర్తల అరెస్టు అన్యాయం

- యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.సత్యవతి

**రావికమతం, ఫిబ్రవరి 7:** సమస్యలను ప్రభుత్వానికి చెప్పుకోవడానికి అమరావతి వెళుతున్న ఆశ కార్యకర్తలను మార్గ మధ్యంలో వాహనాల నుంచి పోలీసులు దించేసి అరెస్టు చేయడం అన్యాయమని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.సత్యవతి అన్నారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి విజయవాడకు బయలు దేరుతున్న ఆశ కార్యకర్తల్లో కొంతమందిని ఇళ్ల వద్ద, మరికొంత మందిని దారిలో అనకాపల్లి, నక్కపల్లి, ఎలమంచిలి ప్రాంతాల్లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆమె చెప్పారు. తమ సమస్యలను ప్రభుత్వానికి కాకపోతే మరెవరికి చెప్పుకోవాలని ఆమె ఆవేదనతో ప్రశ్నించారు. అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలు తమ ఆందోళనను ఆపలేవని, జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని ఆమె హెచ్చరించారు. కాగా రావికమతం మండలం కొమిర, కవ్వగుంట, చినపాచిల, గుమ్మాళ్లపాడు, కేబీపీ అగ్రహారం, తదితర గ్రామాల నుంచి విజయవాడ వెళుతున్న ఆశ కార్యకర్తలను రాత్రి పది గంటలకు నక్కపల్లి పోలీసులు వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద బస్సుల్లో నుంచి కిందకు దించి అక్కడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


రావికమతం మండలం నుంచి విజయవాడకు బస్సుల్లో వెళుతున్న ఆశ కార్యకర్తలను నక్కపల్లి మండలం వేంపాడు టోల్‌ప్లాజా వద్ద దించేసిన పోలీసులు

## నేవీ ప్రహరీ గోడ నిర్మాణ పనులు అడ్డగింత


అధికారులతో మాట్లాడుతున్న సర్పంచ్ నారాయణరావు

**రాంబిల్లి, ఫిబ్రవరి 7:** మండలంలోని వైలోవ గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ వద్ద డీఆర్‌డీవో చేపట్టిన ప్రహరీ గోడ నిర్మాణ పనులను బుధవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. వైలోవ గ్రామంతో పాటు పెదకలవలాపల్లి గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండల చుట్టూ నేవీ ప్రహరీ గోడను నిర్మిస్తోంది. వైలోవ గ్రామ సమీపంలో ఉన్న గుడి వద్ద కొండపై నుంచి ఇళ్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రహరీ గోడ నిర్మిస్తామని చెప్పిన అధికారులు అందుకు విరుద్ధంగా గుడి ముందు నుంచి గ్రామానికి చేరువగా ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతుండడంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అప్పలస్వామి, సీఐలు దీనబంధు, లక్ష్మణరావులు వైలోవ గ్రామానికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. గోడ నిర్మాణంతో జరిగే నష్టాన్ని గ్రామ సర్పంచ్ బద్ది నారాయణరావు, మాజీ సర్పంచ్ బి.నారాయణరావు తదితరులు అధికారులకు వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని గ్రామస్థులకు సీఐ, తహసీల్దార్ హామీ ఇచ్చారు.

### మతిస్థిమితం లేని వ్యక్తి అప్పగింత

**పాయకరావుపేట, ఫిబ్రవరి 7:** మతిస్థిమితం లేని వ్యక్తిని పోలీసులు గుర్తించి అతని స్నేహితుడికి అప్పగించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పాయకరావుపేట దేవీనగర్‌లో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి తిరుగుతున్నట్టు పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులు అక్కడికి వచ్చి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఆ వ్యక్తి ఒడిశా రాష్ట్రం కోరాపుట్ గ్రామానికి చెందిన జుత్తుల అంథోనిగా గుర్తించారు. అనారోగ్యంతో చికిత్స నిమిత్తం విశాఖపట్నం వచ్చిన ఆంథోని మానసిక స్థితి బాగోలేక రైలులో పాయకరావుపేట వచ్చినట్టు అతడి స్నేహితుడైన తుని పట్టణానికి చెందిన కోనేటి రవికుమార్ తెలపడంతో ఆంథోనిని అతనికి అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.

## ఆశ కార్యకర్తలకు పోలీసుల నోటీసులు

- విజయవాడ ధర్నాకు వెళ్లకుండా అడ్డంకులు


ఆశ కార్యకర్తలకు నోటీసులు ఇచ్చిన అనకాపల్లి పట్టణ పోలీసులు

**అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 7:** విజయవాడలో గురువారం జరిగే ఆశ కార్యకర్తల ఆందోళనకు బయలుదేరుతున్న పట్టణంలోని పలువురు ఆశ కార్యకర్తలకు బుధవారం పట్టణ పోలీసులు నోటీసులు అందజేశారు. ఇలా నోటీసులను 20 మందికి పైగా ఆశ కార్యకర్తలకు పోలీసులు ఇచ్చినట్టు తెలిసింది. దీనిని సీఐటీయూ నాయకులు, ఆశ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు ఖండించారు. విజయవాడలో సమస్యలపై శాంతియుతంగా దర్నా చేయడానికి వెళుతున్న కార్యకర్తలను జిల్లాలో ఎక్కడికక్కడ నిర్బంధించి రైలెక్కుతున్న వారిని దించేసి భయాందోళనకు గురిచేయడం దారుణమని సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఆశ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు కె.శాంతి, వై.పార్వతి ఖండించారు. ఎన్టీఆర్ వైద్యాలయం, సబ్ సెంటర్ల వద్ద ఉన్న ఆశ కార్యకర్తలకు నోటీసులు ఇచ్చి విజయవాడ వెళితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించడం ప్రభుత్వానికి తగదన్నారు. పలువురు కార్యకర్తలను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించి తరువాత వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

### అచ్యుతాపురంలో..


అచ్యుతాపురంలో ఆశ కార్యకర్తకి నోటీసు ఇస్తున్న పోలీసులు

**అచ్యుతాపురం:** తమ సమస్యలు పరిష్కరించాలని గురువారం విజయవాడలో జరిగే ధర్నాకు వెళుతున్న ఆశ కార్యకర్తలకు పోలీసులు సెక్షన్ 149 నోటీసులు జారీ చేశారు. పోలీసులు బుధవారం ఆశ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. దీనిని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు ఖండించారు.

### బీజేపీ ఎమ్మెల్యే టికెట్‌కు పది మంది దరఖాస్తు

**అచ్యుతాపురం, ఫిబ్రవరి 7:** ఎలమంచిలి నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతూ పార్టీ అధిష్ఠానానికి పది మంది దరఖాస్తులు పంపారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు వీరంతా దరఖాస్తులు చేశారు. కాగా పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, పార్టీ రాష్ట్ర సైనిక్‌సెల్ కో కన్వీనర్ అగ్గాల హనుమంతరావు, అనకాపల్లి పార్లమెంట్ కన్వీనర్ బీబీఎస్ వర్మ పేర్లు అధిష్ఠానం పరిశీలనలో ఉన్నాయని తెలిసింది.

## అప్పన్న తెప్పోత్సవం రేపే

- ఏర్పాట్లు పూర్తి.. సర్వాంగ సుందరంగా వరాహ పుష్కరిణి


నౌకను సిద్ధం చేస్తున్న సాంకేతిక సిబ్బంది

**సింహాచలం, ఫిబ్రవరి 7 :** వరాహలక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం కొండదిగువ స్వామివారి పుష్కరిణిలో శుక్రవారం జరగనుంది. ఈమేరకు ఈఓ శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు కార్యనిర్వాహక ఇంజినీరు బండారు రాంబాబు సారథ్యంలో అధికారులు పుష్కరిణి పరిసరాలను తీర్చిదిద్దుతున్నారు. ప్రత్యేక పూజలు జరిగే మండపానికి, పుష్కరిణి మెట్లకు రంగులు అద్దారు. విద్యుద్దీపాలంకరణకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవంలో భాగంగా ఉదయం 7 నుంచి 8 గంటల వరకు దేవాలయ అర్చక బృందం సంప్రోక్షణ చేస్తారు. సాయంత్రం 4 నుంచి 4.30 గంటల స్వామివారు వేణుగోపాలుడి అలంకరణలో ఉభయ దేవేరులతో మెట్లమార్గంలో కొండదిగువ తొలిపావంచాకు చేరుకుంటారు. అక్కడి నుంచి పుష్కరిణి వద్దకు వెళ్లి ప్రత్యేక వేదికపై 5.30 గంటలకు భక్తులకు దర్శనమిస్తారు. అనంతరం హంసాకృతి నౌకపై పుష్కరిణిలో విహరిస్తారు. రాత్రి 7.15 వరకు పుష్కరిణి మధ్యలో ఉన్న మండపంలో పూజలు చేస్తారు. అక్కడి నుంచి పుష్కరిణి సత్రం ప్రాంగణానికి చేరుకుని 8.15 గంటలకు సర్వజన మనోరంజని వాహనంపై మాడవీధుల్లో తిరువీధి జరుపుతారు. తిరిగి మెట్ల మార్గంలో స్వామివారు సింహగిరికి చేరుకోవడంతో ఉత్సవం ముగుస్తుంది.

### అంతర్ జిల్లా హాకీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక


అంతర్ జిల్లా హాకీ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

**ఎలమంచిలి, ఫిబ్రవరి 7:** కర్నూలు జిల్లాలో ఈ నెల 10వ తేదీ నుంచి జరగనున్న 14వ అంతర్ జిల్లా సబ్ జూనియర్ బాలుర హాకీ టోర్నమెంట్‌కు అనకాపల్లి జిల్లా జట్టును బుధవారం స్థానిక రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో ఎంపిక చేసినట్టు జిల్లా హాకీ అడహాక్ కమిటీ వైస్ చైర్మన్ కొఠారు నరేశ్ తెలిపారు. ఎంపికైన వారిలో పి.జగదీశ్(కెప్టెన్), బి.సమిధర్, కె.సూర్య, టి.శ్రీధర్, కె.పవన్‌కుమార్, కె.గణేశ్, ఎల్.చైతన్య, రామ్‌చరణ్, జి.స్వరూప్, భరత్, శివసూర్య మణికంఠ, చరణ్ శ్రీవర్దన్, కె.మనోజ్, కె.దుర్గా వెంకటసాయి, డి.రోహిత్, ఏపీ వెంకట్ ఉన్నారని తెలిపారు.

### రిమాండ్ ఖైదీ మృతి

- గుండెపోటుతో చనిపోయినట్టు సూపరింటెండెంట్ ప్రకటన
- జైలు అధికారులు కొట్టడం వల్లే చనిపోయినట్టు మృతుడి బంధువుల ఆరోపణ

**విశాఖపట్నం , ఫిబ్రవరి 7:** విశాఖపట్నం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గుడే పోతన్న (45) మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్టు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం...అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం బద్దంబూరు గ్రామానికి చెందిన పోతన్న గత ఏడాది జూలైలో గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడికి పాడేరు కోర్టు రిమాండ్ విధించడంతో పోలీసులు సెంట్రల్ జైలుకు తరలించారు. జైలుకు వచ్చిన సమయంలోనే అనారోగ్యంగా ఉన్నాడు. మంగళవారం ఉదయం అస్వస్థతకు గురవ్వడంతో జైలు వైద్యులు పరీక్షలు జరిపి, అతనికి గుండె సంబంధిత సమస్య ఉన్నట్టు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతుండగా గుండెపోటు రావడంతో మృతిచెందినట్టు సూపరింటెండెంట్ తెలిపారు. కాగా జైలు అధికారులు కొట్టడం వల్లే పోతన్న చనిపోయినట్టు అతని కుటుంబీకులు, బంధువులు ఆరోపిస్తున్నారు.

# కోడలికి ఉద్యోగం ఉంటే మామ పింఛన్ రద్దు చేస్తారా?

- విద్యుత్ బిల్లు ఎక్కువచ్చిందని పథకాలకు దూరం చేస్తారా?
- కాఫీ మొక్కలు నాటుకున్న రైతులకు బిల్లులు చెల్లించరా?
- గ్రామాల్లో గ్రావెల్ రోడ్ల నిర్మాణం ఎందుకు జరగడం లేదు?
- చింతపల్లి మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ప్రశ్నల వర్షం

**చింతపల్లి, ఫిబ్రవరి 7:** సమస్యలపై ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. కోడలికి ఉద్యోగం ఉంటే మామ పింఛన్ రద్దు చేయడం.. విద్యుత్ బిల్లు ఎక్కువ వచ్చిందనే సాకుతో పథకాలకు దూరం చేయడం.. గ్రామాల్లో గ్రావెల్ రహదారుల నిర్మాణాలు జరగకపోవడం.. కాఫీ మొక్కలు నాటుకున్న రైతులకు బిల్లులు ఇవ్వకపోవడం.. తదితర సమస్యలపై సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ కోరాబు అనుషదేవి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభలో తొలుత వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం వివిధ అంశాలపై జరిగిన చర్చలో లోతుగెడ్డ సర్పంచ్ సునీల్ మాట్లాడుతూ కోడలు ఉద్యోగస్తురాలని మామకు పింఛన్ రద్దు చేస్తారా? విద్యుత్ బిల్లు అధికంగా వచ్చిందని అమ్మఒడి, చేయూత పథకాలకు దూరం చేస్తారా? అని ప్రశ్నించారు. వివాహం జరిగిన తరువాత తల్లిదండ్రులు, కుమారుడు కుటుంబం వేర్వేరుగా జీవనం సాగిస్తారన్నారు. విద్యుత్ బిల్లులకు సంక్షేమ పథకాలకు ముడిపెట్టడం సరికాదన్నారు. దీనికి



సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న ఈపీడీసీఎల్ ఏఈఈ ప్రభాకరరావు

విద్యుత్ శాఖ ఏఈఈ వనుము ప్రభాకరరావు స్పందిస్తూ, అధిక విద్యుత్ బిల్లుల కారణంగా సంక్షేమ పథకాలకు దూరమైతే తమను సంప్రదిస్తే సరిచేస్తామన్నారు. యర్రబొమ్మలు ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్యనారాయణ మాట్లాడుతూ కాఫీ తోటల్లో గ్యాప్ ఫిల్లింగ్ కోసం మొక్కలు నాటుకున్న రైతులకు నెలలు గడిచిపోతున్నప్పటికీ ఎందుకు బిల్లులు చెల్లించడం లేదని ప్రశ్నించారు. అలాగే డ్రయింగ్ యార్డులు నిర్మించుకున్న రైతులకు నగదు చెల్లించలేదన్నారు. దీనిపై కాఫీ ప్రాజెక్టు సబ్ అసిస్టెంట్ ధర్మరాయ్ మాట్లాడుతూ డ్రయింగ్ యార్డులకు సంబంధించి నగదు కేంద్ర ప్రభుత్వ కాఫీ బోర్డు అధికారులు చెల్లించాల్సి ఉందన్నారు. గ్యాప్ ఫిల్లింగ్ నగదు చెల్లించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళతామన్నారు. చింతపల్లి మండల కేంద్రంలో ఇంటింటికీ కొళాయిలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని, మండల కేంద్రం ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యులు జయలక్ష్మి, ధారలక్ష్మి పద్మ సభలో ప్రస్తావించారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ గడుతూరి స్వర్ణలత మాట్లాడుతూ మండల కేంద్రానికి మూడు పథకాలు మంజూరయ్యాయన్నారు. కొన్ని వీధులకు ట్యాప్‌లు నిర్మించామని, మిగిలిన ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఏరియా ఆస్పత్రిలో గైనకాలజిస్టు అందుబాటులో ఉండడం లేదని, దీంతో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదని మెజారిటీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి వైద్యాధికారి వి.రుక్మిణి సమాధానం ఇస్తూ వారంలో రెండు, మూడు రోజులు ఆరోగ్య సురక్ష శిబిరాలకు గైనికాలజిస్టు వెళ్తున్నారని, దీంతో కొంత సమస్య తలెత్తున్నదని చెప్పారు. ఆరోగ్య సురక్ష శిబిరాలు ముగిసిపోతే పూర్తి స్థాయిలో ఆస్పత్రిలో అందుబాటులో ఉంటారన్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో మంజూరైన గ్రావెల్ రహదారుల నిర్మాణాలు ఎందుకు జరగడంలేదని జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య ప్రశ్నించారు. టెండర్లన్నీ ఒకే వ్యక్తికి కట్టబెట్టడం వల్ల పనులు జరగడం లేదని అసహనం వ్యక్తం చేశారు. గ్రావెల్ రోడ్లు కాంట్రాక్టు పొందేందుకు ఉన్న శ్రద్ధ పనులు చేయడంలో ఎందుకు లేదని నిలదీశారు. దీనికి టీడబ్ల్యూ ఏఈఈ రఘునాథరావునాయుడు స్పందిస్తూ గ్రావెల్ రోడ్ల పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీడీవో వీర సాయిబాబు, వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు, అధికారులు పాల్గొన్నారు.


మండలాల ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

## ఎన్నికల ప్రక్రియలో అలసత్వాన్ని ఉపేక్షించం

- అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో, ఐటీడీఏ పీవో అభిషేక్

**పాడేరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):** ఎన్నికల ప్రక్రియలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ హెచ్చరించారు. అరకులోయ నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాలకు చెందిన సహాయ ఎన్నికల అధికారుల (తహసీల్దార్లు)తో బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియను పక్కాగా పూర్తి చేయాలన్నారు. అలాగే సకాలంలో ఓటింగ్ యంత్రాలు, ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను స్వయంగా పరిశీలింతాలని, లోపాలు ఉంటే సరిచేయాలని సూచించారు. అలాగే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి సజావుగా ఓటింగ్ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌డీసీ వీవీఎస్.శర్మ, అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

## ఈసీ ఆదేశాలు పక్కాగా అమలుచేయండి

- జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జేసీ భావన వశిష్ఠ

**పాడేరు రూరల్, ఫిబ్రవరి 7:** ఎన్నికల కమిషన్ ఆదేశాలను పక్కాగా అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ సూచించారు. బుధవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని వివిధ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై ఆరా తీశారు. అలాగే విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి ఏర్పాట్లతో పాటు ర్యాంప్‌ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్‌లు ప్రత్యక్షంగా సందర్శించి అవసరమైన ఏర్పాట్లను గుర్తించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఈసీ ఆదేశాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.అరుణకుమారి, ఎన్నికల డీటీ కె.లక్ష్మణమూర్తి, వీఆర్‌వోలు పి.పద్మావతి, జె.వెంకటలక్ష్మి, గ్రామ వలంటీర్‌లు పాల్గొన్నారు.

## రక్తదానంతో ప్రజారోగ్యానికి మేలు: ఎస్పీ తుహిన్ సిన్హా


శిబిరంలో రక్తదానం చేస్తున్న జిల్లా ఎస్పీ తుమిన్ సిన్హా

**హుకుంపేట, ఫిబ్రవరి 7:** రక్తదానం చేయడం వల్ల ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు చేసిన వారవుతారని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. మండల కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించి స్వయంగా రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన యువకులు ఆరోగ్యవంతులని, అందరూ రక్తదానం చేసి ప్రజారోగ్యానికి సహకరించాలని కోరారు. ఈ శిబిరంలో 53 మంది యువతీ, యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరావు, ఎస్ఐ సతీష్, ఏఎస్ఐ లక్ష్మణరావు, ఈవోపీఆర్డీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

**జి.మాడుగుల, ఫిబ్రవరి 7:** మానసిక ఉల్లసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని నుర్మతి పోలీసు అవుట్‌పోస్టు సీఆర్‌పీఎఫ్ సీవో రాజేశ్‌పాండే చెప్పారు. అవుట్‌పోస్టు ప్రాంగణంలో బుధవారం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడా జట్లకు షీల్డుతో పాటు వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేశ్, ఎస్ఐ శ్రీనివాసరావు, సర్పంచ్ సూరిబాబు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి పనులు కల్పించాలని కూలీల నిరసన

**ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 7:** బాబుసాల పంచాయతీ కేంద్రంలో ఉపాధి పనులను కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిరసన తెలిపారు. స్థానిక కల్యాణ మండపం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి, అక్కడ ఆందోళనకు దిగారు. బాబుసాలలో ఏడాదిగా ఉపాధి లబ్ధిదారులకు పని కల్పించలేదని వారు నినాదాలు చేశారు. అనంతరం ఎంపీడీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కె.త్రినాథ్, ఎం.ఎం.శ్రీను, నర్సయ్య, రామదాసు, భీమరాజు, గిరిజనులు పాల్గొన్నారు.

## మన్యంలో కులగణన సర్వే పక్కాగా చేయండి

**అరకులోయ, ఫిబ్రవరి 7:** మన్యంలో కులగణన సర్వే పక్కాగా చేపట్టాలని ఏపీ ఆదివాసీ జేఏసీ అరకు మండల కన్వీనర్ ఎస్.గోపాల్ డిమాండ్ చేశారు. పలువురు దొంగ ఎస్టీ సర్టిఫికెట్లతో అన్ని రకాల గిరిజనుల ప్రయోజనాలు పొందుతున్నారని, వారిని గుర్తించి సర్టిఫికెట్లను రద్దు చేయాలని కోరారు. అలాగే సర్వేలో తగిన ఆధారాలు చూపితేనే ఎస్టీలుగా గుర్తించాలని ఆయన విన్నవించారు. అతని వెంట జేఏసీ ప్రతినిధులు ఎల్.మహదేవ్, రామ్, చందర్,బుద్దు, చిట్టిబాబు, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

# మనం వేసే ఓటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలి

- 'మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్'లో మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

**పాడేరు రూరల్, ఫిబ్రవరి 7:** 'రాష్ట్రాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకం. మనం వేసే ఓటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలి' అని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. 'మై ఫస్ట్ ఓటు సీబీఎన్' కార్యక్రమంలో భాగంగా బుధవారం పాడేరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ దిశదశను మార్చే అస్త్రం ఓటు అన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతో పాలకులను, ప్రభుత్వాలను ఎన్నుకునే గొప్ప అవకాశం ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో యువత ఏకతాటిపైకి వచ్చి మీ మొదటి ఓటును రాష్ట్రంలో గొప్ప విజన్ గల నాయకుడు, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు వేసి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలు, విద్య, వైద్యం, న్యాయం, భద్రత అందించ గల సామర్థ్యం ఉన్న చంద్రబాబునే సీఎంను చేసుకుందామన్నారు. మన రాష్ట్రం, గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. యువతీ, యువకులు రానున్న ఎన్నికల్లో కుల, మతాలకు అతీతంగా సమర్థవంతమైన నాయకుడికి మొట్ట మొదటి ఓటును వేసి రాష్ట్ర సంక్షేమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ యువజన నాయకుడు గబ్బాడ సింహాచలం, పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్‌కుమార్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, మండల అధ్యక్షుడు కూడి రామునాయుడు, నాయకులు అల్లంగి సుబ్బలక్ష్మి, కోరాబు స్వర్ణ, కోటి, నీలకంఠం, ప్రైవేటు కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రైవేటు కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

# మల్లుదొర వారసుడికి మెరుగైన వైద్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**కొయ్యూరు, ఫిబ్రవరి 7:** స్వాతంత్ర్య సమరయోధుడు గాం మల్లుదొర వారసుడు గంటం దొర మనువడు బోడి దొరకు ఎట్టకేలకు వైద్య సేవలు అందించారు. 'మల్లు దొర వారసుడు దుర్భర జీవనం' పేరిట సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఐటీడీఏ పీవో వి.అభిషేక్ స్పందించారు. అతని ఆదేశాల మేరకు రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి మనోజ్ఞ బోడిదొర స్వగ్రామమైన లంకవీధి వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అలాగే హుటాహుటిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి మెరుగైన వైద్య సేవలు అందించే చర్యలు తీసుకున్నారు. అలాగే 'ఆంధ్రజ్యోతి' వార్తా కథనాన్ని చూసిన అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు స్పందించారు. అతను ప్రత్యేక చొరవ తీసుకుని అనారోగ్య బారిన పడిన బోడి దొర అనారోగ్య పరిస్థితులను విశాఖపట్నంలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ కేంద్రానికి మంగళవారం వెళ్లి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబును కలసి బోడి దొర ఆరోగ్య పరిస్థితిని వివరించారు. వెంటనే ఆయన పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌ను ఫోన్‌లో సంప్రదించారు. దీంతో పీవో ఆదేశాల మేరకు రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్ఞ హుటాహుటిన బోడిదొర స్వగ్రామానికి వెళ్లి ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. మోతాదుకు మించి బీపీ మాత్రలు వాడడడంతో అస్వస్థతకు గురైనట్టు గుర్తించారు. దీంతో వెంటనే బోడిదొరను రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో ప్రస్తుతం బోడిదొర ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండి వైద్య సేవలు పొందుతున్నారు. అయితే బోడిదొర అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుమార్తె పోషణలో ఉంటూ కాలం వెల్లదీస్తున్నాడు. ఈ విషయమై ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తగిన సహాయ సహకారాలు అందించాలని బోడిదొర కోరుతున్నారు.


బోడి దొరకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

## వైసీపీతో గిరిజనాభివృద్ధి శూన్యం

- కాంగ్రెస్ నేత శెట్టి గంగాధర్‌స్వామి

**అరకులోయ, ఫిబ్రవరి 7:** వైసీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతం అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ పార్టీ అరకు అసంబ్లీ నియోజకవర్గ నేత శెట్టి గంగాధర్‌స్వామి అన్నారు. మాదల పంచాయతీలోని గ్రామాల్లో బుధవారం విస్తృతంగా పర్యటించారు. గిరిజనులతో మాట్లాడి కాంగ్రెస్ పాలనలో చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూనే, వైసీపీ వల్ల గిరిజనాభివృద్ధి ఎంత కుంటిపడిందో వివరించారు. గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వ విఫలమైందని చెప్పారు. గిరి రైతులకు సాగు, తాగునీటి సౌకర్యం కల్పించలేదని, చెక్‌డామ్‌లు నిర్మించలేదని, పాత వాటికి మరమ్మతులు చేయలేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. రాజశేఖరెడ్డి వారసురాలు షర్మిలమ్మ నాయకత్వంలో కాంగ్రెస్‌ను ఆదరించాలని ఆయన కోరారు.

## గైనకాలజిస్టులను నియమించాలి

- టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ నేత సన్యాసమ్మ

**ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 7:** స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో శాశ్వత గైనకాలజిస్టులను నియమించాలని టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షురాలు కె.సన్యాసమ్మ డిమాండ్ చేశారు. బుధవారం ఆమె సీహెచ్‌సీని సందర్శించి వైద్యులతో మాట్లాడారు. అలాగే అక్కడ రోగులతో, గర్భిణులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీహెచ్‌సీలో గైనిక్ లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కానింగ్ తీయించుకొనేందుకు వచ్చే వారు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అలాగే సీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్మాణంతో ముప్పుపై జెన్‌కో సీఈకి వినతి

**సీలేరు, ఫిబ్రవరి 7:** పంప్డ్ సోరేజీ నిర్మాణంతో ముప్పు వాటిల్లుతుందనే భయాందోళనలపై ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. పంప్డ్ స్టోరేజీ కి అవసరమైన అటవీ భూముల పరిశీలనకు అటవీశాఖ సీసీఎఫ్ వస్తున్న నేపథ్యంలో జెన్‌కో సీఈ సీలేరు విచ్చేశారు. ఇటీవల జెన్‌కో అధికారులు గ్రామస్థులపై వ్యవహరిస్తున్న తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు నేపథ్యంలో కొన్ని ప్రదేశాలు ఖాళీ చేయాల్సి వస్తోందని భయాందోళనలకు గురి చేస్తున్న సంఘటనలను సీఈ దృష్టికి తీసుకు వెళ్లారు. ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో సీలేరు ప్రజలకు ఎటువంటి నష్టం వాటిల్లదని చెప్పి, ఇప్పుడు కొన్ని ప్రాంతాలు ఖాళీ చేసి వెళ్లిపోవాలంటే ఎక్కడికి పోగలతమని సీఈని ప్రశ్నించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను మరమ్మతులు చేసుకున్నా అధికారులు ఆంక్షలు విధిస్తున్నారని, 50 సంవత్సరాలుగా రేకుల షెడ్లలోనే నివాసం ఉంటున్నామని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా శ్లాబ్‌లు కాకుండా గోడలు కట్టుకుని రేకులు వేసుకుంటున్నా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు వాపోయారు. ఈనికి సీఈ స్పందిస్తూ అధికారుల నోటీసులో పెట్టి పనులు చేసుకుంటే ఇబ్బందులు ఉండవని భరోసా ఇచ్చారు.

## జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ విజేత పెదలబుడు

**అరకులోయ, ఫిబ్రవరి 7:** జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో పెదలబుడు జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబును బుధవారం జట్టు సభ్యులు కలిశారు. వారిని సర్పంచ్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా మరింత పట్టుదలతో ఆడి ట్రోఫీని గెలవాలని ఈ సందర్భంగా ఆయన అకాంక్షించారు. ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారని, అరకొర సౌకర్యాలతో పోటీల్లో తలపడడం క్రీడాకారులకు కష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, తగిన ప్రోత్సాహం అందించాలని సర్పంచ్ దాసుబాబు అధికారులను కోరారు. మట్టిలో మాణిక్యాలు మాదిరిగా క్రీడల్లో గిరిజన విద్యార్థులు తమ సత్తాను చాటుతారని, ప్రభుత్వం నిర్వహించే పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా నిర్వాహకులు, అధికారులు కనీస సౌకర్యాలు కల్పించకపోతే ఎలా అని ప్రశ్నించారు. క్రీడాకారులపై నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, గ్రామీణ క్రీడాకారులకు తగిన విధంగా ప్రోత్సహించాలని ఆయన కోరారు.


క్రీడాకారులను అభినందిస్తున్న సర్పంచ్ దాసుబాబు

# మూలగరువులో కలకలం

... 5వ పేజీ తరువాయి

గ్రామానికి చెందిన గిరిజనులు ఆ మేకను కోసుకుని మధ్యాహ్నం, రాత్రి కూడా ఆహారంగా తీసుకున్నారు. మేక మాంసాహారం తిన్న గిరిజనులకు అర్ధరాత్రి నుంచి వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయానికి గిరిజనులు తీవ్ర అస్వస్థతతో మంచం పట్టారు. ఆశ కార్యకర్త ఈ విషయాన్ని వైద్యాధికారి సౌమ్యకు తెలియజేయడంతో అంబులెన్స్‌లో గ్రామానికి వెళ్లి చికిత్స ప్రారంభించారు. సుమారు 20 మంది సాయంత్రానికి కోలుకున్నారు. మరో 11 మందిని అంబులెన్స్‌లో ఆర్‌వీనగర్ పీహెచ్‌సీకి తరలించి మెరుగైన చికిత్స అందించారు. వంతల మల్లేష్ అనే వ్యక్తి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిజనుల ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, గ్రామంలోనూ పరిస్థితి అదుపులోకి వచ్చిందన్నారు. గ్రామంలో మూడు రోజులపాటు బేస్ క్యాంప్ ఏర్పాటు చేసి మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు పూర్తిగా కోలుకున్న తరువాత గ్రామానికి పంపిస్తామని చెప్పారు.


గ్రామంలో చికిత్స పొందుతున్న బాధితులు

# సుజల స్రవంతిపైనా అబద్ధాలు

... 5వ పేజీ తరువాయి

ప్రకటించి, తరువాత రైతులకు పరిహారం ఇవ్వాలి. ఇందుకు తొలివిడతగా రూ.900 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా ఇప్పటివరకూ రూపాయి విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో భూసేకరణకు సర్వే పనులు సాగుతున్నా నిధులు మాత్రం కేటాయించలేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉండగా..ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పడంపై రైతులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. కాగా రూ.7,500 కోట్లతో ప్రాజెక్టు నిర్మించాలని సుమారు 14 ఏళ్ల క్రితం ప్రతిపాదించారు. ప్రస్తుతం వ్యయం రూ.17,050 కోట్లకు చేరింది.

## సంక్షిప్తంగా..

### ఆశ వర్కర్ల చలో విజయవాడను అడ్డుకోవడం సరికాదు

- సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

**పాడేరు రూరల్, ఫిబ్రవరి 7:** ఆశ వర్కర్లు, సీహెచ్ డబ్ల్యూలు నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించడం అన్యాయమని వాపోయారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఆయన స్పష్టం చేశారు. చలో విజయవాడకు పయనమయ్యే సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్, ఉపాధ్యక్షుడు బొండా సన్నిబాబు తదితరులను గృహ నిర్బంధం చేయడం జగన్‌రెడ్డి ప్రభుత్వానికి తగదన్నారు. ఇదే తీరును కొనసాగిస్తే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కార్మిక వర్గం నుంచి తీవ్రమైన ప్రతిఘటన తప్పదని ఆయన హెచ్చరించారు.

### ప్రజల సంక్షేమానికే 'బాబు ష్యూరిటీ'

**చింతపల్లి, ఫిబ్రవరి 7:** ప్రజల సంక్షేమానికి 'బాబు ష్యూరిటీ' కార్యక్రమమని టీడీపీ నేత కొట్టగుళ్లి సుబ్బారావు అన్నారు. చింతపల్లి, జీకే వీధి మండలాల్లోని లక్కవరపుపేట, దేవరాపల్లి, పెదవలస గ్రామాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంత ప్రజలు సైతం టీడీపీకి అండగా నిలవాలని, వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో సమాధానం చెప్పాలని కోరారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముక్కలి మహేశ్, బుజ్జిబాబు, బాబూరావు, కల్యాణి, నూకాలమ్మ పాల్గొన్నారు.

### గోతులు పూడ్చలేని దుస్థితిలో ప్రభుత్వం

**పాడేరు రూరల్, ఫిబ్రవరి 7:** రాష్ట్రంలో రోడ్లు వేయని వైసీపీ ప్రభుత్వం కనీసం గోతులను కూడా పూడ్చలేని దుస్థితిలో ఉందని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్‌కుమార్ అన్నారు. పాడేరులోని ప్రధాన రహదారిలోని వివిధ ప్రాంతాల్లో గోతులు పూడ్చే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టామన్నారు. ప్రభుత్వం ఎలాగూ స్పందించడం లేదని, ఆర్‌అండ్‌బీ అధికారులైనా స్పందించి పాడేరు, అరకు నియోజకవర్గాల పరిధిలోని ప్రధాన రహదారిలోని గోతులను పూడ్చాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

### అంగన్‌వాడీ కేంద్ర భవనం ప్రారంభం

**చింతపల్లి, ఫిబ్రవరి 7:** మండలంలోని రాజుపాకలు గ్రామంలో రూ.11.2 లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య బుధవారం ప్రారంభించారు. మండలంలో 11 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయని, వాటిని వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సమిడి గోపాల్, ఎంపీటీసీ సభ్యుడు లోవరాజు, ఎంపీడీవో వీరసాయి బాబు, ఐసీడీఎస్ సీడీపీవో బీవీ రమణి, ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు గౌహర్ ఉన్నీష బేగం, విజయకుమారి, రామలక్ష్మి, సత్యవతి, అప్పలనర్స, గౌరి పాల్గొన్నారు.

### అగ్ని ప్రమాద బాధితులకు సాయం

**కొయ్యూరు:** కంఠారంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు టీడీపీ నేత ఎంవీవీ ప్రసాద్ ఆర్థిక సాయం అందించారు. ప్రసాద్ సోదరుడు అశోక్ బుధవారం కంఠారం గ్రామం వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం వారికి వంట పాత్రలు, నిత్యావసర సరకులు, దుస్తులతో పాటు రూ.10 వేల నగదును అందించారు. అలాగే జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీరామూర్తి కూడా ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లోతా భీమరాజు, పాంగి బాబు పాల్గొన్నారు.

### 'ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణాల్లో నాణ్యతా లోపం'

**కొయ్యూరు:** మండలంలోని బాలారం గ్రామంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తున్నదని బీజేపీ నాయకుడు మురుకుర్తి అప్పలరాజు ఆరోపించారు. బుధవారం ఈ పనులను పరిశీలించి ఇసుక నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించకపోతే ఎలా అని ప్రశ్నించారు. నిర్మాణాల తీరును అధికారులు పరిశీలించి నాణ్యతతో జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరిమెల రాజు, చంద్రరావు, సంపరి శివ తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**హుకుంపేట:** మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ కూడా రాజుబాబు, జడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం బుధవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ నిధులతో రచ్చబండ నిర్మాణం, మండల పరిషత్ నిధులతో కల్వర్టు నిర్మాణాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సర్పంచ్ పూర్ణిమకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నైని సతిబాబు, అనిల్ పాల్గొన్నారు.

### ఆశ కార్యకర్తలకు నోటీసులు తగవు

**డుంబ్రిగుడ:** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ కార్యకర్తలు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తుగా నోటీసులు ఇవ్వడం తగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు అన్నారు. ఆశ కార్యకర్తలకు ఇళ్లకు పోలీసులు వెళ్లి నిర్బంధించడం అన్యాయమన్నారు. ఇది నిరంకుశ పాలనకు అద్దం పడుతున్నదన్నారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా పోలీసుల ద్వారా ఉద్యమాన్ని ప్రభుత్వం నీరుగార్చే పనిచేయడం దారుణమని పేర్కొన్నారు.

### ఎర్రబయలులో శాంతిభద్రతలు నెలకొల్పాలి

**పెదబయలు:** ఇంజరి పంచాయితీ ఎర్రబయలు గ్రామంలో శాంతిభద్రతలు నెలకొల్పాలని గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో పర్యటించి గిరిజనుతో మాట్లాడారు. దాడి జరిగి ఐదు రోజులైనా గిరిజనులు భయభ్రాంతులతోనే జీవిస్తున్నారని, పోలీసులు వెంటనే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కురుసా పార్వతమ్మ, పి.మత్స్యకొండబాబు, కె.చిన్నయ్య, జి.లక్ష్మణచారి పాల్గొన్నారు.

### కేంద్ర పథకాలు అందిపుచ్చుకోండి

**జి.మాడుగుల:** కేంద్ర ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకోవాలని బీజేపీ గిరిజన మోర్చా మేధావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కురుసా పార్వతమ్మ కోరారు. నుర్మతి పంచాయతీ వాకపల్లిలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో ఆమె మాట్లాడుతూ పీవీటీజీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ గ్రామంలో 40 కుటుబబాలకు కేంద్ర ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయడం గొప్పవిషయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.మహేశ్వరరావు, మత్స్యకొండబాబు, చిన్నయ్య, లక్ష్మణచారి తదితరులు పాల్గొన్నారు.